# ఓ. కే

ఆ రోజు నిద్ర లేచినప్పటి నించీ జగపతి విసుగ్గా ఉన్నాడు. రాత్రంతా సరిగా నిద్ర లేదు. ఒక్కటే ఉక్క—సీలింగ్‌ఫాను అర్ధరాత్రి ఉన్నట్టుండి దయ్యం పట్టినట్టు ఒకటే రొద మొదలుపెట్టింది. అందుబాటులో కర్ర ఉంటే విరగ్గొట్టి పారేసేవాడు. భరించలేక స్విచ్ ఆఫ్ చేశాడు. కొని నాలుగు సంవత్సరాలు కాలేదు. అప్పుడే చెడ్డది. బేరింగ్స్ పోయాయి కాబోలు. ఆ పోయేవి పగటిపూట పోకూడదూ ? తక్షణం ఇంకో ఫాను కొనిపారేసేవాడు. ఏ తెల్లారుజామో కాస్త కునుకుపట్టింది. ఎండ కళ్ళలో పొడుస్తుంటే లేచాడు. టైమెంతయిందోనని చూస్తే గడియారం గోడమీదినించి కొండ ముచ్చులా వెక్కిరించింది. బ్రహ్మముహూర్తంలో ఆ రెండు ముళ్ళూ నిశ్చల సమాధి లోకి జారుకున్నాయి. కీ ఇచ్చి డ్రాయర్లోంచి రిస్ట్‌వాచ్ తీసి చూసి ఎనిమిది గంటలు టైం పెట్టేసరికి అదేపనిగా అది గంటమీద గంట నిరవధికంగా ఠంగ్‌ఠంగ్‌న కొట్టటం ప్రారంభించింది. కొని సంవత్సరం కాలేదు. చూపులకి డాబే గాని పనికి ఓడు. కీ అయిపోయేదాకా ఈ గంటలు ఆగవా! హారి భగవంతుడా! ఈ శబ్ద బ్రహ్మని నిశ్శబ్ద సీమలోకి ఎలా ఆవాహన చెయ్యడం! జగపతికి చప్పున గుర్తొచ్చింది. శబ్దాన్ని శబ్దంతోనే ఛేదించాలి. వెంటనే ట్రాన్సిస్టర్ అందుకుని స్విచ్ ఆన్ చేశాడు. అది టూ ఇన్ వన్. స్విచ్‌వేసే మహానుభావుడు దొరకనే దొరికాడుకదా అని అది వెంటనే బాండ్ మేళాలతో ఉరుములు పిడుగుల ఫెళ ఫెళార్భటులను సమ్మేళనం చేస్తూ ధణం ధణ రాగాలాపన అందుకొంది. అదిరిపడి జగపతి దాని నోరు నొక్కేశాడు. వాల్యూం కంట్రోలు చెడ్డది. ఛీ. పట్టి దండగమారి కొనుగోలు. వాల్యూం కంట్రోల్‌మీద చెయ్యి పడితే సరి,అల్సేషియన్‌లా భౌ భౌ మంటుంది! విసిరి పుచ్చుకుని నేలకి ధామ్మని కొట్టా లనిపించింది జగపతికి. తమాయించుకొన్నాడు. చెడటం అనేది వస్తువుల స్వభావం. వీటిని మెకానిక్ మాటిమాటికీ చితకపొడుస్తూ ఉండాలి. జగపతి ఉస్సురంటూ కాల కృత్యాలు తీర్చుకొని కాఫీకై ఎదురుచూచి తను పరాకు చిత్తగిస్తున్నట్టు వెంటనే తెలుసుకున్నాడు.

ఆ రోజు నౌకరు సెలవు. కాఫీ తనే కాచుకోవాలి. వరండాలో గుమ్మం దగ్గిర పాలవాడు పెట్టిపోయిన పాలసీసా తీసుకుని, వంటింట్లోకి పోయి, గాస్ స్టౌ వెలిగించ టానికి లైటర్ వెతికి,స్విచ్ క్లిక్ మనిపించాడు. అది వెలగలేదు. స్టౌవ్ మళ్ళీ వేయిం

చాలని నౌకరు కుర్రాడు అంతకుముందు అనటం గుర్తుకి వచ్చింది. కోపంతో దాన్ని నేలకేసి కొట్టాడు. నిప్పుపుల్లతో స్టౌ వెలిగించుకుని కాఫీ తయారుచేసుకుని తాగి కాస్త స్తిమితపడ్డాడు జగపతి. ఇంతలో పేపరు రావటంతో అతని విసుగుదల మరుగున పడ్డది.

ఆఫీసు టైమవుతుంటే స్నానం వగైరాలు ముగించుకుని డ్రెస్ చేసుకుని స్కూటర్ తియ్యటానికి వరండాలోకి వచ్చాడు జగపతి. అదే సమయంలో వాకిట్లో ఓ ఖరీదైన కారాగింది. గేటు తెరుచుకుని వస్తున్న వ్యక్తిని చూసి జగపతి కొంత సంభ్రమం చెందాడు. అతను ప్రముఖ వ్యాపారస్తుడు, పారిశ్రామికవేత్త గంగారావు.

"నమస్కారం సార్."

"నమస్కారం—రండి, రండి."

సాదరంగా ఆహ్వానించాడు జగపతి. డ్రాయింగ్ రూంలో సోఫామీద సుఖాసీనుడైన గంగారావుని చూసి చిరునవ్వుతో అన్నాడు.

"ఏమిటి ఇలా దయచేశారు?"

"అయ్యో! తమరి దయకోసమే. అన్నట్టు గారేజిలో కారు కనిపించదేం సార్."

జగపతి కొంచెం నొచ్చుకున్నాడు. కొనటమే ఓ సెకండ్‌హాండ్ కారు కొన్నాడు స్టేటస్ కోసం. తను కొత్తగా పర్చేజ్ ఆఫీసర్ అయాడు. కారు లేకపోతే హోదాగా ఉండదు. సరికొత్తది కొనాలంటే సాధ్యం కాదు. బోలెడవుతుంది. వెధవ కారు కొన్నప్పటినించీ రోజుకోసారి చెడుతుంది. ఇతను ఇలా వస్తాడని తెలిస్తే రెండు రోజులు అట్టే పెట్టేవాడు. కాస్త దర్జాగా ఉండేది.

"ఇంజన్ రీ బోరింగ్‌కి మొన్నే పంపానండీ."

"పోనీ నా కారు వాడుకోండి. అది మీదే అనుకోండి ఇవాల్టినించి—రీ బోరింగ్ అయిం తరవాత అమ్మేసెయ్యండి ఆ పాత కారు. ఇది నా గిఫ్ట్—"

"గిఫ్టా? అహహ—ఇంకా నయం. సరే, మీ అభిమానానికి కృతజ్ఞుడిని. అవసరమైతే కబురు పెడతాను. ప్రస్తుతం స్కూటర్ ఉందిలెండి. ఇంతకీ మీరు...."

"ఆఁ. ఆఁ. చెప్తా. చూడండి పర్చేజ్ ఆఫీసర్‌గారూ—మరేమీ అనుకోవద్దు. మీరు సేల్స్‌కి టెండర్లు పిలిచారు కదూ. మేమూ దరఖాస్తు చేశాం. మా శాంపుల్

మీ ఆఫీసులో వుంది. అది మీరు ఓ.కె చేస్తే మీ మేలు మర్చిపోం. అఫ్‌కోర్స్—హయర్ లెవెల్స్‌లో ప్రయత్నం చేశాననుకోండి. మీరు చెయ్యగలిగిన సహాయం చెయ్యాలని ప్రార్థిస్తున్నాం ఊరికే వద్దు—"బ్రీఫ్ కేస్ సగం తెరిచి మూశాడు గంగారావు. జగపతి కళ్ళు మిరుమిట్లు గొల్పాయి.

"సారీ—ఇది నా ఒక్కడివల్ల జరిగేది కాదు. ప్రొసీజర్ ప్రకారం నేను చెయ్యవలసింది చేస్తా. ఏమీ అనుకోవద్దు—"

"మోహమాట పడకండి సార్. కాస్త దాహం యిప్పిస్తారా? చూడండి, నేను మొహమాట పడకుండా అడుగుతున్నాను. మనలో మనకేమిటి సార్—"

"సాఫ్ట్ డ్రింక్స్ తెస్తా వుండండి."

జగపతి లేచి ఇంట్లోకి వెళ్లి ఫ్రిజ్ డోరు తీశాడు. సాఫ్ట్ డ్రింక్ బాటిల్స్ రెండు తీశాడు. వెచ్చగా తగిలాయి అవి అతని వేళ్లకి. అప్పుడు గుర్తుకు వచ్చింది అతనికి—ఫ్రిజ్ చెడి రెండు రోజులయిందని. ముఖం మీద చెమట చేరింది. ఆ బాటిల్స్ తీసుకొని వచ్చి గంగారావుకి ఒకటి ఇచ్చి తను ఒకటి తీసుకున్నాడు.

"క్షమించాలి. చల్లగా లేవు. ఫ్రిజ్ వర్క్—చెయ్యటం లేదు. రెఫ్రిజరెంట్ గాస్ మళ్లీ నింపాలని కాబోలు మెకానిక్ నిన్న వచ్చి చూసి అన్నాడు." "అది డిస్పోజాఫ్ చెయ్యండి సార్. రేపు—ఎందుకూ, ఈ సాయంకాలమే కొత్తది నేను పంపిస్తా."

"అహహ—"

"ఏమిటి సార్, అలా బిడియపడతారు? రెండు, మూడు రోజుల్లో కాస్త మా పని పూర్తి చేస్తారు కదూ—వస్తా, సెలవు. బ్రీఫ్‌కేస్ మీ అల్మైరాలో వుంది."

గంగారావు చప్పున లేచి వెళ్లసాగాడు. జగపతి నిర్విణ్ణుడయాడు. అతనేం చెప్తున్నా వినిపించుకోకుండా గంగారావు వెళ్లిపోయాడు. జగపతికి ఏం చెయ్యాలో తోచలేదు.

సిరి రా మోకాలడ్డ నేల!

జగపతి స్కూటర్ స్టార్ట్ చేసి ఆఫీసుకి చేరాడు. అతని కేదో భయంగావుంది. ఏదో ఉత్సాహంగానూ వుంది. ఎందుకో అందరితో చలాకీగా వుండాలనిపించింది. కాస్త కసురుకోవాలనీ అనిపించింది.

స్టెనో యేవో ఉత్తరాలు టైప్‌చేసి అతని ముందు పెట్టింది.

"హలో విశాలా!" అన్నాడు హుషారుగా.

ఆమె బిడియంగా మందహాసం చేసింది. అంతలోనే జగపతి భ్రుకుటి ముడివాడు.

"వాట్—ఏమిటి ఈ టైపింగ్? 'టి' అక్షరం ఎక్కడా సరిగ్గా కనపడలేదేం? 'టీ' కావాలా?"

విశాల విస్తుపోయింది. గుడ్లనీరు కుక్కుకుంటూ అంది.

"ఆ అక్షరం చెడిందండీ—సరిగా టైపవడం లేదు."

"చెడిందీ! అవును. ఎందుకు చెడదు! నువ్వు టీ తాగలేదని ఆ అక్షరానికి తెలిసిపోయింది. ఆ విషయం అది నాకు గుర్తు చేస్తోందన్నమాట. ఇవాళ సాయంకాలం నేను నీకు టీ ఇస్తున్నాను. అవును. ఎల్లోరాలో. ఏం?"

విశాల ఉక్కిరిబిక్కిరయింది. అతను పర్చేజ్ ఆఫీసరు. మంచి క్వాలిఫికేషన్లు ఉన్నవాడు. ఇంకా పైకి పోతాడు. తను సాధారణ స్టెనో. టెంపరరీ స్టెనో. తనతో అతను ఎందుకు చనువు తీసుకొంటున్నాడు. ఈ రోజే కాదు. అతను తనతో చాలా సార్లు చొరవగా మాట్లాడాడు. ఒకవేళ అతను తనని—ఏమిటి, పిచ్చి కాకపోతే ఈ ఐడియాలు. తనకేమైనా పెద్ద అంతస్తుందా, డబ్బుందా, పలుకుబడి ఉందా, గొప్ప అందం ఉందా?

"ఒప్పుకున్నట్టే కదా!" అతను ఆమె మౌనాన్ని వినియోగించుకొన్నాడు.

విశాల ఇరకాటంలో పడ్డది! పోనీ, ఒప్పుకుంటే మాత్రం ఏం? టీ యే కదా? ఆమె మందహాసం చేసింది. జగపతిలో ఉత్సాహం పెల్లుబికింది. చప్పున అనేశాడు.

"నువ్వంటే నాకెంతో ఇష్టం విశాలా. నిన్ను నేను ప్రేమిస్తున్నాను. నువ్వు ఒప్పుకుంటే మనం పెళ్ళి చేసుకుందాం. ఏమంటావు?"

విశాల బిత్తరపోయింది. ఉక్కిరిబిక్కిరయింది. అతని వైపు అయోమయంగా చూసింది.

"ఆలోచించుకో. తొందర్లేదు. ఆఫీస్ టైం కాగానే పోదాం. ఆ హోటల్

చాలా దూరమైనా ఏకాంతంగా లాన్స్‌లో కూర్చునే సదుపాయం ఉంటుంది. స్కూటర్ మీద పోదాం. ఏం అభ్యంతరమా?"

విశాలకి ఏమనటానికి తోచలేదు.

"అభ్యంతరం లేదు కదూ! ఓ.కె. అన్నట్టు—ఈ మెసేజ్ కాస్త ఫోనోగ్రాం ద్వారా పంపు విశాలా" అతను బిజినెస్ మెసేజ్ ఏదో ఆమెకి అందించాడు.

మెసేజ్ తీసుకుని విశాల వెళ్ళిపోతుంటే జగపతి ఆమె నడకలోని సొంపునీ, వయ్యారాన్నీ కళ్ళప్పగించి చూశాడు. ఆమెని అలా స్పష్టంగా చూడటం అతనికి అదే మొదటిసారి! విశాల అందమైంది అని గట్టిగా అనటానికి వీల్లేకపోయినా ఆమెలో ఏదో ఆకర్షణ ఉంది అనుకున్నాడు. అతనిలో ఏదో తపన, ఏదో కోరిక, ఏదో ఆశ కలిగాయి. ఆమెలో కొంత అమాయికత ఉందని కూడా అతను కనిపెట్టాడు. నిజంగా తనకి ఈమెని పెళ్ళి చేసుకోవాలని ఉందా? జగపతి తర్కించాడు. నిజానికి ఆమెలో ప్రేమించదగింది ఏముంది? కాని ఆమె తనకి కావాలనిపిస్తోంది. ఏదో తృష్ణ! జగపతి ఆలోచనలు పరిపరి విధాల పోయాయి, అప్రయత్నంగా ఫోన్ రిసీవర్ తీసుకొన్నాడు. తనని ఏదో శాసిస్తున్నట్టు, ఆ శాసనాన్ని తుచ తప్పకుండా తను అమలుపరుస్తున్నట్లు అతనికి అనిపించింది. ఎల్లోరాలో డబుల్‌రూం బుక్ చేయాలి. అవతల నించి జవాబులేదు. అసలు ఆ ఫోను పనిచెయ్యటం లేదని ఎంక్వయిరీలో తెలిసింది. అతని చేతులు రిసీవర్‌ని యథాస్థానంలో పెట్టాయి. డామ్ ది ఫోన్. ఇప్పుడే అది చెడాలా!

సాయంకాలం ఆఫీసు నించి అందరూ వెళ్ళిపోయేదాకా జగపతి తచ్చాడాడు. తరవాత స్కూటర్ తీసి గేటు దగ్గిరికి వచ్చాడు. అక్కడ ఓ పక్కగా విశాల నిలబడి ఉంది. సంతోషంతో పొంగిపోయాడు. స్కూటర్ ఆమె దగ్గర ఆపాడు. ఆమె వెనక కూర్చొంది.

స్కూటర్ సాగిపోతోంది. జగపతి ఆఘమేఘాలమీద పోతున్నాడు. విశాలకి ఏమిటో బెరుకుగా ఉంది. ఉన్నట్టుండి స్కూటర్ అకస్మాత్తుగా ఆగిపోయింది. విశాల దిగి పక్కన నుంచుంది. జగపతి స్కూటర్ దిగి స్టాండ్ వేశాడు. జేబురుమాలుతో ముఖం తుడుచుకొన్నాడు.

"రెచెడ్ స్కూటర్. సమయానికి చెడాలా ! పైన పటారం లోపల లొటారం అన్నట్టు పై షోకే గాని పట్టి దండగమారి స్కూటర్" విసుక్కొన్నాడు జగపతి. విశాల ఏమీ అనకపోతే బాగుండదని నవ్వుతూ అంది.

"ప్రాణంలేని స్కూటర్‌కి సమయాసమయాలెలా తెలుస్తాయండి?"

"అబ్బ విశాలా! ఈ మధ్య—ముఖ్యంగా ఇవాళ నా అనుభవాలు తలుచుకుంటే నవ్వాలో ఏడవాలో తెలీదు. సీలింగ్‌ఫాన్ చెడింది, గోడగడియారం చెడింది. ట్రాన్సిస్టర్ చెడింది, గాస్‌లైటర్ చెడింది, కారు చెడింది, ఇంటికొచ్చిన అతిథికి కాస్త కూల్ డ్రింక్స్ ఇద్దామంటే ఫ్రిజ్ చెడింది, హోటల్‌కి ఫోన్ చేద్దామంటే—అదే రూం కోసం—ఐ మీన్—సీట్లు రిజర్వేషన్ కోసం ఫోన్ చేద్దామంటే వాళ్ళ ఫోన్ చెడింది. ఇక నీతో సరదాగా టీ తీసుకుందామని వెడుతుంటే ఈ దౌర్భాగ్యపు స్కూటర్ చెడింది. యాక్సిలరేటర్ కట్ అయిందో, క్లచ్ వైర్ స్లిప్ అయిందో, అసలు పెట్రోలులోనే డస్ట్ వుందో ఏమిటో, ఇహ దాన్ని మరమ్మత్తు చెయ్యాలి. అదృష్ట వశాత్తూ యిక్కడ దగ్గర్లో వర్క్‌షాపు వుంది. అక్కడి దాకా తోసుకుపోక తప్పదు. ఛీ, ఛీ, ఏ వస్తువు కొన్నా, అది బాగా పనిచేసినట్టే చేసి ఠక్కున చెడి ఊరుకుంటుంది. ఖర్మ అనుకో! ఒక్కటంటే ఒకటి సరిగా పనిచెయ్యదు. అసలీ ప్రపంచంలో చెడని వస్తువంటూ వొకటుందా అంట? అందువల్ల నాగరికతకి చిహ్నమైన యీ రక రకాల వింత వస్తువుల్ని ప్రక్కన వదిలేసి మనం శుభ్రంగా ఆదిమ నాగరికత వైపు తిరుగు ప్రయాణం చెయ్యటం మంచిది. అవునా, కాదా?"

విసుగ్గా, గంభీరంగా మొదలుపెట్టి కొంచెం హాస్యంతో ముగించిన జగపతి ప్రసంగం వింటూ విశాల అతని ముఖంలోకి తేరిపార చూస్తోంది.

"ఏమంటావు?" రెట్టించాడు జగపతి.

విశాల మందహాసం చేసింది జవాబుగా.

"సరే, ఈ స్కూటర్ వర్క్‌షాపులో ఇచ్చి వస్తాను. నువ్విక్కడే వుండు. టాక్సీ మీద పోదాం."

జగపతి స్కూటర్ తోసుకుంటూ వర్క్‌షాపు వైపు నడిచాడు. అతను తిరిగి వచ్చేసరికి అక్కడ విశాల లేదు. అతను నిశ్చేష్టు డయాడు. ఆమె ఎందుకు వెళ్ళి పోయింది? అతనికి టాక్సీ ఎక్కటానికి బుద్ధిపుట్టలేదు. స్కూటర్ కోసం ఆగాలని పించలేదు. రిక్షామీద పోటానికి మన సొప్పలేదు. నడవసాగాడు. నడిచి నడిచి కాళ్ల నొప్పులు పుట్టసాగాయి. ఓ కిల్లీ కొట్టు దగ్గర బల్ల కనిపించగా ఉసురో మంటూ కూలబడ్డాడు. ఆ వెంటనే అతనికి జ్ఞానోదయమైనట్టయింది, నవ్వూ వచ్చింది.

జగపతి ఇంటికి చేరే సరికి ఫోన్ మోగుతోంది.

"హలో"

"ఎవరు, ఆఫీసరు గారేనా, నేను సార్ గంగారావుని—ఏం లేదు, ఆ శాంపిల్ సంగతి ఓసారి గుర్తుచేద్దామని—"

"సారీ—అది బొత్తిగా నాణ్యత లేని శాంపుల్—అసంభవం—దాన్ని చచ్చినా నేను ఓ.కె. చెయ్యలేను. సారీ." దృఢంగా కఠినంగా అన్నాడు జగపతి. ఫోన్ విసురుగా పెట్టేశాడు.

ఫోన్ మళ్ళీ మోగింది. కోపంగా రిసీవర్ అందుకున్నాడు జగపతి.

"ఆఫీసరు గారేనా? నేను విశాల నండీ, సారీ, క్షమించండి, ఏమీ అనుకోవద్దు సార్."

"ఓ.కె." అన్నాడు జగపతి క్లుప్తంగా, మృదువుగా.

[జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక 1980]